క్లుప్తంగా

13న గొర్రెలు, మేకల సంత వేలం పాట

ఉప్పునుంతల: మండలంలోని వెల్టూరు గొర్రెలు, మేకల సంతకు సంబంధించి 2024–25 ఆర్థిక సంవత్సరానికిగాను 13న ఉదయం 11 గంటలకు స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో వేలం పాట నిర్వహిస్తునట్లు కార్యదర్శి ఉమాశంకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలం పాటలో పాల్గొనే వారు గ్రామ పంచాయతీ పేరిట రూ. 30 వేలు డీడీ చెల్లించాలని కోరారు.

ఉపాధి పనులపై విచారణ



కల్వకుర్తిరూరల్: మండలంలోని తర్నికల్‌లో 2023వ సంవత్సరంలో నిర్వహించిన ఉపాధి హామీ పనులలో అక్రమాలు జరిగాయని పలువురు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మంగళవారం డీఆర్‌డీఓ అంబుడ్స్‌మన్ పర్సన్ జంగయ్య గ్రామానికి చేరుకొని విచారణ చేపట్టారు. ఫిర్యాదులపై అధికారులు పొంతన లేని సమాధానాలు ఇవ్వడంతో అధికారులు, ఫిర్యాదుదారుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. మరో వారం తరువాత పూర్తి విచారణ చేపడుతామని అంబుడ్స్‌మన్ జంగయ్య పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి హరిణి, శ్రీశైలం, సాయమ్మ, ఊశమ్మ, సురేష్‌గౌడ్, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

జిల్లా అధ్యక్షుడిగా హరీశ్‌గౌడ్



నాగర్‌కర్నూల్: జిల్లా కేంద్రానికి చెందిన కాటమోని హరీశ్‌గౌడ్ జై గౌడ ఉద్యమం జిల్లా యువజన విభాగం జిల్లా అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కొల్లాపూర్‌కు చెందిన సోమ భాస్కర్ గౌడ్ రాష్ట్ర కార్యదర్శిగా ఎంపికయ్యారు. వీరికి జై గౌడ్ ఉద్యమం జాతీయ అధ్యక్షుడు వట్టికూటి రామారావుగౌడ్, రాష్ట్ర అధ్యక్షుడు గుండ్రాతి నారాయణ గౌడ్‌లు మంగళవారం హైదరాబాదులో నియామక పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో జాతీయ నాయకులు సత్యంగౌడ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు చిట్టిబొమ్మ కిషోర్ గౌడ్, నాగర్‌కర్నూల్ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు సోమప్రగతి గౌడ్, నానిగౌడ్, గౌడ నాయకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలపై రాజీలేని పోరాటం



కల్వకుర్తిరూరల్: ఉపాధ్యాయుల సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తామని టీఎస్ పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు మర్యాద కృష్ణారెడ్డి అన్నారు. పట్టణంలోని టీఎన్‌జీఓ భవనంలో ఆ సంఘం సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి సురేందర్‌రెడ్డిలు హాజరై మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి రియాజ్, అసోసియేట్ అధ్యక్షుడిగా వహీద్, మహిళా ఉపాధ్యక్షురాలుగా స్వప్న, కార్యదర్శిగా రాజేశ్వరిలని ఎన్నుకుని వారిని సన్మానించారు. కార్యక్రమంలో సత్యనారాయణరెడ్డి, రఘునాథ్‌రెడ్డి, రాజలత, శ్రీనివాస్, శ్రావణ్, మల్లేష్‌తో పాటు పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పంటలను కాపాడుకుందాం



చారకొండ: ఇటీవల కురిసిన వర్షాల కారణంగా పంట పొలాల్లో నిలిచిన వర్షం నీటిని పంటల నుంచి వెళ్లేవిధంగా రైతులు చర్యలు తీసుకోవాలని ఏఈఓ వంశీ సూచించారు. మంగళవారం మండలంలోని సిర్సనగండ్లలో రైతుల పొలాలను పరిశీలించి పొల్లాలో నీరు నిలిచి పత్తిపంటకు వేరు వ్యవస్థ దెబ్బతిన్నట్లు గుర్తించారు. పంట రక్షణకు సంబంధిత క్రిమిసంహారక మందులు వ్యవసాయ అధికారుల సలహాల మేరకు స్ప్రే చేయాలని రైతులకు వివరించారు.

వ్యక్తికి రిమాండ్

వెల్దండ: మండలంలోని పెద్దాపూర్ గ్రామానికి చెందిన దండుగుల శేఖర్ ఈ నెల 9న డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడ్డాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని మంగళవారం నిందితుడిని కల్వకుర్తి కోర్టులో ఎస్‌ఐ కురుమూర్తి హాజరుపర్చారు. న్యాయమూర్తి కావ్య విచారించి ఒకరోజు రిమాండ్ విధించారని దీంతో నిందితుడిని రిమాండ్ తరలించినట్లు పేర్కొన్నారు.

రుణమాఫీ అయ్యేనా?



పెంట్లవెల్లి సొసైటీ ఎదుట నిరసన తెలుపుతున్న రైతులు



పెంట్లవెల్లి సొసైటీ

పెంట్లవెల్లి: ప్రభుత్వం రైతులకు పంట రుణాలు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేసింది. మూడు విడుతలుగా ప్రకటించినా మండలంలో సొసైటీకి సంబంధించిన 499 మంది రైతులకు ఒక్కరికి రుణమాఫీ కాకపోవడంతో ఆందోళనబాట పట్టారు. ప్రతిరోజు చిన్న, సన్నకారు రైతులు బ్యాంకులు, అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా పట్టించుకునేవారే కరువయ్యారు. ఎక్కడికెళ్లాలో తెలియక రైతులు తలలు పట్టుకుంటున్నారు. పెంట్లవెల్లి సొసైటీలో 499 మంది రైతులకు రూ.3.26 కోట్ల వరకు రుణమాఫీ కావల్సి ఉంది. కాని ఎవరికి రుణమాఫీ కాకపోవడంతో సోమవారం సొసైటీ ఎదుట దాదాపు 100 మంది రైతులు నిరసన వ్యక్తం చేశారు. సొసైటీ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అదేవిధంగా కొల్లాపూర్ నియోజకవర్గంలో ఉన్న సొసైటీలలో అధికారులు టెక్నికల్ సమస్య అంటూ దాటవేస్తున్నారు. ఇప్పటి వరకు కొల్లాపూర్ నియోజకవర్గంలో ఉన్న సొసైటీల్లో భాగంగా పెద్దకొత్తపల్లి, నర్సాయిపల్లి, మాచినేనిపల్లి, కొండ్రావుపల్లి, కొల్లాపూర్, కోడేరు సొసైటీలకు సగం మందికి మాత్రమే రుణాలు మాఫీ అయినట్లు పంచాయతీ అధికారులు తెలిపారు.

అధికారులు పట్టించుకోవడం లేదు



రెండు సంవత్సరాల కిందట నాలుగు ఎకరాల భూమిని సొసైటీలో తాకట్టు పెట్టి రూ.83 వేలు రుణం తీసుకున్నాను. గత ప్రభుత్వంలో రుణమాఫీ కాకపోగా కాంగ్రెస్ ప్రభుత్వంలో కూడా రుణమాఫీ కాలేదు. బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.

– రామన్‌గౌడ్, వేముకల్లు

న్యాయం చేయాలి

రూ.2 లక్షల వరకు రుణమాఫీ ఉన్న రైతులందరికీ రుణమాఫీ చేయాలి. సొసైటీలో ఇప్పటివరకు రూ.లక్ష వరకు కూడా రుణాలు మాఫీ కాలేదు. అధికారులు, పాలకులు చొరవ తీసుకొని రైతులకు న్యాయం చేయాలి.

– చిన్న బిచ్చన్న, మాధవస్వామి నగర్

కమిషనర్‌ను కలిశాం

పెంట్లవెల్లి రైతుల సమస్యలను వారం రోజుల కిందట హైదరాబాద్‌లో కమిషనర్‌ను కలిసి విన్నవించాం. టెక్నికల్ సమస్య ఉందని త్వరలో రైతులందరికీ రుణమాఫీ అవుతుందని చెప్పారని పేర్కొన్నారు.

– విజయరామారావు, సింగిల్ విండో చైర్మన్

చాకలి ఐలమ్మకు ఘన నివాళి



కల్వకుర్తిలో నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, తదితరులు



అచ్చంపేటలో చాకలి ఐలమ్మకు నివాళులర్పిస్తున్న సీఐటీయూ నాయకులు

సాక్షి, నెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. నాగర్‌కర్నూల్‌లో ఉన్న ఐలమ్మ విగ్రహాలకు బీఎస్పీ, సీపీఎం నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. కల్వకుర్తిలో మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, మాజీ సర్పంచ్ ఆనంద్‌లు ఐలమ్మకు నివాళి అర్పించి ఆమె సేవలను కొనియాడారు. బీసీ సబ్‌ప్లాన్ సాధన కమిటీ, ఐలమ్మ విగ్రహ కమిటీ ఆధ్వర్యంలో, సీఐటీయూ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఐలమ్మ వర్ధంతిని నిర్వహించారు. కోడేరు, చారకొండ, పెద్దకొత్తపల్లిలో రజక సంఘం, అచ్చంపేట, పెంట్లవెల్లి, జటప్రోలు సీపీఎం నాయకులు, కొల్లాపూర్‌లో బీఆర్‌ఎస్ నాయకులు నివాళులర్పించారు. తెలకపల్లి, మన్ననూర్, ఉప్పునుంతలలో ఐలమ్మ పోరాట స్ఫూర్తి అందరికి ఆదర్శమని వక్తలు పేర్కొన్నారు.

అగ్రిసెట్‌లో ప్రతిభ కనబర్చిన గీత



వంగూరు: మండలంలోని డిండిచింతపల్లి గ్రామానికి చెందిన పున్నమల్ల గీత అగ్రిసెట్ డిప్లొమా ఫలితాల్లో రాష్ట్ర స్థాయి జనరల్ కేటగిరిలో 13వ స్థానం, ఎస్సీ రిజర్వ్‌డ్ కేటగిరిలో 2వ స్థానం దక్కించుకుంది. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఆగస్టు నెలలో నిర్వహించిన పరీక్షల ఫలితాలు మంగళవారం వెలువడ్డాయి. విద్యార్థిని తల్లిదండ్రులు అంజనేయులు, విజయతో పాటు గ్రామస్తులు గీతను అభినందించారు.

ప్రజా ఉద్యమాలను బలోపేతం చేస్తాం



నాగర్‌కర్నూల్‌రూరల్: ప్రజా ఉద్యమాలను బలోపేతం చేస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు కందికొండ గీత అన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. కర్షకుల, కార్మికులకు అండగా ఉంటామన్నారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆర్ శ్రీనివాసులు, మండల కార్యదర్శి కొంపల్లి అశోక్, పొదిల రామయ్య, సత్యనారాయణ, నర్సింహ, కురుమయ్య, మల్లికార్జున్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

కేసు నమోదు

నాగర్‌కర్నూల్ క్రైం: సోషల్‌మీడియాలో అసభ్యకరంగా పోస్టింగులు చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ గోవర్ధన్ మంగళవారం తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం జిల్లా కేంద్రానికి చెందిన ఖానాపురం శరత్ కొన్ని రోజుల కిందట రెడ్డి సామాజిక వర్గానికి చెందిన మహిళలపై అసభ్యకరంగా పోస్టింగులు పెట్టడంతో పోలిస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి ఖానాపురం శరత్‌ను మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిని శిక్షించాలని మహిళలు డీఎస్పీ బుర్రి శ్రీనివాస్‌ను కోరారు.

మానసిక ఒత్తిళ్లకు గురికావొద్దు

లింగాల: మానసిక ఒత్తిళ్లకు గురికావొద్దని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ప్రోగ్రాం అధికారి డాక్టర్ అల్లె శ్రీనివాసులు సూచించారు. మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ శాఖ బాలుర గురుకుల కళాశాలలో మంగళవారం ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవ సందర్భంగా విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యోగా, ధ్యానం అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు శివశంకర్, ప్రిన్సిపాల్ బాలస్వామి, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

రోబోటెక్స్ శిక్షణ ప్రారంభం

నాగర్‌కర్నూల్‌రూరల్: సోహం అకాడమీ ఆఫ్ హ్యూమన్ ఎక్సలెన్స్ ఆధ్వర్యంలో రోబోటెక్స్ ఇన్ అకాడమిక్స్ కార్యక్రమాలను మంగళవారం జెడ్పీహెచ్‌ఎస్ బాలుర, కేజీబీవీ నాగనూలు, టీజీడబ్ల్యూఆర్‌ఎస్ పాఠశాల బిజినేపల్లిలో శిక్షణను ప్రారంభించినట్లు జిల్లా విద్యాధికారి గోవిందరాజు తెలిపారు. 7, 8, 9, 10 తరగతుల నుంచి 342 మంది విద్యార్థులు శిక్షణలో పాల్గొననున్నట్లు తెలిపారు. కలెక్టర్ బాగావత్ సంతోష్, జిల్లా విజ్ఞాన అధికారి రాజ శేఖర్, షరీఫుద్దీన్‌లు శిక్షణ కేంద్రాన్ని సందర్శించారు. కార్యక్రమంలో నాగర్జున కన్‌స్ట్రక్షన్ కంపెనీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సన్మానం



నాగర్‌కర్నూల్‌రూరల్: జిల్లా కేంద్రంలోని నెల్లికొండ ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో చదివిన విద్యార్థులు కోఠి మహిళా యూనివర్సిటీ క్యాంపస్‌లో నందిని, మండి అనిత, కమ్మర్ షాజహాన్ సీట్లు పొందారు. ఈ మేరకు విద్యార్థులను మంగళవారం కళాశాలలో సన్మానించారు. అధ్యాపకులు కోదండరాములు, ఉమాదేవి, రామకృష్ణ తదితరులు ఉన్నారు.

అభివృద్ధికి సహకరించండి

చారకొండ: సీఎం రేవంత్ రెడ్డి సోదరుడు కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు తిరుపతిరెడ్డిని మండలంలోని గోకారం, జూపల్లి కాంగ్రెస్ నాయకులు మంగళవారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. గ్రామాల అభివృద్ధికి సహకరించాలని కోరారు. భాస్కర్ రెడ్డి, బాలేమియా, బొడ్డుపల్లి కొండల్, బాలరాజు తదితరులు ఉన్నారు.

పోషకాహారంతో ఆరోగ్యం

బల్మూర్: పోషకాహారంతో ఆరోగ్యం ఉంటారని ఐసీడీఎస్ సీడీపీఓ దమయంతి అన్నారు. పోషణ మాసం కార్యక్రమంలో భాగంగా మంగళవారం మహాదేవ్‌పూర్ సెక్టార్ పరిధిలోని తుమ్మెన్‌పేట 2,3 అంగన్‌వాడీ కేంద్రాల్లో పరిశుభ్రత, వ్యాధుల నిర్మూలనపై గర్భిణులకు, బాలింతలు, చిన్నారుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కార్యదర్శి ఫజల్, సూపర్‌వైజర్ నిర్మల, అంగన్‌వాడీ టీచర్లు సునీత, శారద గ్రామస్తులు పాల్గొన్నారు.

చారకొండ: మండల కేంద్రంలోని 5వ అంగన్‌వాడీ కేంద్రంలో పోషక మహోత్సవాలు నిర్వహించారు. వైద్య అధికారి మంజుభార్గవి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రసీదున్నీసా, సీహెచ్‌ఓ శేకర్ రెడ్డి, హెచ్‌ఓ ఎన్‌డీవీ చారి, ఏఎన్‌ఎంలు అలివేలు, సరిత, అంగన్‌వాడీ టీచర్ వెంకటమ్మ, ఆశాలు తదితరులు ఉన్నారు.

లింగాల: పోషణ అభియాన్‌లో భాగంగా మంగళవారం మండలంలోని కొత్తకుంటపల్లి అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ మాసోత్సవాలను నిర్వహించారు. పౌష్టికాహారంపై పిల్లలకు, తల్లులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు అరుణ, శ్రీలత, కవిత తదితరులు పాల్గొన్నారు.

చికిత్సపొందుతూ మహిళ మృతి

నాగర్‌కర్నూల్ క్రైం: చికిత్సపొందుతూ మహిళ మృతి చెందిన ఘటన జిల్లా కేంద్రంలోని జనరల్ ఆస్పత్రిలో మంగళవారం చోటుచేసుకుంది. బాధిత కుటుంబసభ్యుల వివరాల ప్రకారం వనపర్తి జిల్లా తల్పానూరు గ్రామానికి చెందిన కురుమమ్మ(30) వారం రోజులుగా జ్వరంతో బాధపడుతోంది. పరిస్థితి విషమించడంతో జిల్లా కేంద్రంలోని జనరల్ ఆస్పత్రికి తరలించారు. సోమవారం రాత్రి చికిత్స పొందుతూ మృతి చెందింది. వైద్యుల నిర్లక్ష్యంతోనే కురుమమ్మ మృతిచెందిందని ఆందోళన చేపట్టగా పోలీసులు జోక్యం చేసుకొని వారిని శాంతింపజేశారు. ఘటనకు సంబంధించి ఎస్‌ఐ గోవర్ధన్‌ను వివరణ కోరగా ఫిర్యాదు అందలేదని పేర్కొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

లింగాల: క్రీడలతో మానసిక, శారీరక ఉల్లాసం కలుగుతుందని ఎస్‌ఐ జగన్‌మోహన్ అన్నారు. మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ శాఖ బాలుర గురుకుల పాఠశాల, కళాశాల ఆవరణలో మంగళవారం మండల స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన వారిని డివిజన్ స్థాయికి ఎంపిక చేస్తారని పేర్కొన్నారు. కబడ్డీ, వాలీబాల్, ఖోఖో పోటీలు ఉత్సాహంగా కొనసాగాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బాలస్వామి, జీహెచ్‌ఎం బషీర్ అహ్మద్, పీడీలు వెంకటేశ్వర్లు, వసంత్, నరేందర్, సూర్యనారాయణ, రమేష్, వెంకటేశ్వర శర్మ, నరసింహ్మ, రహిమ, విజయలక్ష్మి పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



లింగాల: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2008–09 పదో తరగతికి బ్యాచ్‌కు చెందిన సంధ్యారాణి కుటుంబానికి మంగళవారం స్నేహితులు రూ. 51,800లు, క్వింటాల్ బియ్యంను పంపిణీ చేశారు. స్నేహితురాలి భర్త నఫీస్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. మానవత దృక్పథంతో సాయం అందించనట్లు మిత్రులు పేర్కొన్నారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎం బషీర్ అహ్మద్, పూర్వపు విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


వంగూరు: మండలంలోని ఉల్లంపల్లి గ్రామానికి చెందిన మహేష్ అనారోగ్యంతో ఇటీవల మృతిచెందాడు. డ్రైవర్ల యూనియన్, గ్రామస్తులు పోగు చేసి మంగళవారం రూ.92 వేలు, అదే గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు సలేశ్వరం రూ.20 వేలు అందజేశారు.

వెల్దండ: మండలంలోని చొక్కన్నపల్లి గ్రామానికి చెందిన ఏకుల కిష్టమ్మ అనారోగ్యంతో మంగళవారం మృతి చెందింది. సింగిల్‌విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్యగౌడ్ రూ.5వేలు, ఉప్పల వెంకటేష్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.5వేలు అందజేశారు.

ఎన్‌ఏఎస్ పరీక్ష

పెద్దకొత్తపల్లి/వెల్దండ: పెద్దకొత్తపల్లి కేజీబీవీ, ప్రాథమిక పాఠశాలల్లో, ప్రభుత్వ పాఠశాలల్లో అదేవిధంగా కోడేరు మండల కేంద్రంతో పాటు వివిధ పాఠశాలలో 3, 6, 9వ తరగతి విద్యార్థులకు ఎన్‌ఏఎస్ పరీక్షలు మంగళవారం నిర్వహించారు. మండల నోడల్ ఆఫీసర్ శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు.

చింతకుంటలో రక్త నమూనాల సేకరణ



పాన్‌గల్: మండలంలోని చింతకుంటలో పీహెచ్‌సీ డాక్టర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో మంగళవారం రక్త నమూనాలను సేకరించారు. గ్రామంలో ఠాగూర్ అనే బాలుడికి డెంగీ పాజిటివ్ రావడంతో బాలుడి కుటుంబాన్ని పరామర్శించి, కుటుంబ సభ్యులతో పాటు ఇంటి పరిసరాల్లోని పలు గృహాల వారి నుంచి నుంచి రక్త నమూనాలు సేకరించినట్లు డాక్టర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా డెంగీ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన నియమాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ముఖ్యంగా దోమలు వృద్ధి చెందకుండా నీటి నిల్వలు లేకుండా చూసుకోవడం, నిల్వ నీటిని వారానికి ఒక్కసారి పారబోసి నూతన నీటిని పట్టుకోవడం, వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల శుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి ఉమాదేవి, ఎంపీడీఓ గోవింద్‌రావు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రామయ్య, ఎంఎల్‌హెచ్‌పీ డాక్టర్ నాగరాజు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు

దండాలయ్యా.. ఉండ్రాలయ్యా



నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడు



కల్వకుర్తి మండలం తాండ్రలో పూజలు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

సాక్షి, నెట్‌వర్క్: నాగర్‌కర్నూల్ జిల్లా వ్యాప్తంగా వినియక ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. నాల్గోరోజు మంగళవారం వాడవాడల ప్రతిష్టించిన వినాయక విగ్రహాలకు భక్తులు పూజలు నిర్వహించారు. పలు వినాయక మండపాల వద్ద అన్నదానం చేశారు. తెలకపల్లి సీఎల్‌ఆర్ కళాశాలలో ఏర్పాటు చేసిన గణనాథులకు పూజలు నిర్వహించిన నిమజ్జనానికి తరలించారు. కల్వకుర్తిలో భజనలు, కోలాటాలతో సందడి చేశారు. కాయతి ఆశాదీప్‌రెడ్డి తాండ్రలో పూజలు చేశారు.

కనీస వేతనం చెల్లించాలి



ఉప్పునుంతల: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వంట మహిళా కార్మికులకు కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మారేడు శివశంకర్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వంట మహిళలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. కనీసం రోజువారి కూలి కూడ పడటంలేదని వాపోయాడు. పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలన్నారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు చిన్నపాగ శ్రీనివాసులు పాల్గొన్నారు.

పాత భవనాన్ని తొలగించాలి



బల్మూర్: స్థానిక ఎస్సీ బాలుర వసతి గృహంలో ప్రమాదభరితంగా ఉన్న పాత భవనాన్ని తొలిగించాలని సీపీఎం మండల కార్యదర్శి శంకర్‌నాయక్ డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం ఎస్సీ బాలుర వసతి గృహాన్ని పరిశీలించి విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. దోమల బెడదతో రోగాలబారిన పడుతున్నారన్నారు. అధికారులు స్పందించి పాత భవనాన్ని తొలగించి విద్యార్థులకు ఆట స్థలానికి కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు లాల్‌అహ్మద్, ఆంజనేయులు, మాసయ్య, బక్కయ్య, భరత్, కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణం చేపట్టాలని నిరసన

తాడూరు: మండలంలోని అల్లాపూర్ నుంచి తాళ్లపల్లి వరకు రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరతూ మంగళవారాం సీపీఎం ఆధ్వర్యంలో గ్రామస్తులు నిరసన వ్యక్తం చేశారు. 15 ఏళ్ల కిందట మట్టి రోడ్డు నిర్మించారని వర్షాకాలంలో రోడ్డు బురదమయంగా మారడంతో అడుగుతీసి అడుగు వేయలేని దుస్థితి నెలకొందని వివరించారు. అధికారులు పరిశీలించి రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేసి పనులు చేపట్టాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు.

రాజ్యాంగాన్ని పరిరక్షించుకుందాం

కొల్లాపూర్ రూరల్: రాజ్యాంగాన్ని పరిరక్షించుకుందామని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్ బాబు అన్నారు. మంగళవారం పట్టణంలోని కేఎల్‌ఐ గెస్టు హౌజ్‌లో రాజ్యాంగం ఎదుర్కొంటున్న సవాళ్లు అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. కేవీపీఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అంతటి కాశన్న, పరశురాములు, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివవర్మ, సలీం, సురేందర్, రాష్ట్ర కమిటీ సభ్యులు హనుమంతు, బత్తిని రాజు, సంజీవులు, రాజు తదితరులు పాల్గొన్నారు.

టీపీసీసీ అధ్యక్షుడిని కలిసిన ఎన్నారై కమిటీ సభ్యులు



అచ్చంపేట రూరల్: టీపీసీసీ అధ్యక్షుడిగా నియమితులైన మహేష్‌కుమార్‌గౌడును హైదరాబాద్‌లో మంగళవారం టీపీసీసీ ఎన్నారై సెల్ సలహాదారుల కమిటీ సభ్యులు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు బొజ్జ అమరేందర్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు.

రోడ్డుకు మరమ్మతు చేయాలని ఎమ్మెల్యేకు వినతి

చారకొండ: మండల కేంద్రంలో ఉన్న ఆర్‌అండ్‌బీ రోడ్డుకు మరమ్మతు చేపట్టాలని కోరుతూ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకట్‌గౌడ్, మండల అధ్యక్షుడు బాల్‌రాంగౌడ్‌లు గ్రామస్తులతో మంగళవారం అచ్చంపేట్ ఎమ్మెల్యే వంశీకృష్ణకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. పలు గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

కల్వకుర్తిరూరల్: పట్టణంలో విద్యుత్ డివిజన్ కార్యాలయం ఏర్పాటు చేయాలని విద్యుత్ ఎంప్లాయిస్ 114 యూనియన్ జిల్లా నాయకులు సీఎండీ ముషారఫ్ ఫారూఖీకి వినతిపత్రం అందజేశారు. మంగళవారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో యూనియన్ జిల్లా అధ్యక్షులు రాంచందర్ నాయక్, రాష్ట్ర నాయకుడు నిరంజన్ యాదవ్‌ల ఆధ్వర్యంలో సీఎండీని సత్కరించి పుష్పగుచ్చం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కల్వకుర్తి రెవెన్యూ డివిజన్ పరిధిలో అత్యధిక వ్యవసాయ కనెక్షన్లు ఉన్నాయన్నారు. సీఎండీ సానుకూలంగా స్పందించినట్లు వారు పేర్కొన్నారు. అనంతరం విద్యుత్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ నాయకులు సీఎండీని కలిసి నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో స్టోర్ ఏర్పాటు చేయాలని వినతిపత్రం అందజేశారు. సంఘం నాయకులు రాజు, తిరుపతయ్య, రామస్వామి, కాంట్రాక్ట్ అసోసియేషన్ నాయకులు రఘునందన్, శ్రీనివాసులు, మల్లేష్, రేవంత్, సిరాజ్, వెంకటేష్, శ్రీధర్, మధు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ ఈఓకు..

తెలకపల్లి: మండల కేంద్రంలోని పెద్ద చెరువు వద్ద వినాయక నిమజ్జనానికి అన్ని ఏర్పాట్లు చేయాలని కోరుతూ గ్రామస్తులు గ్రామ పంచాయతీ ఈఓ భాస్కర్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. చెరువుకట్టపై కంపచెట్లు తొలగించాలని కోరారు. ఈదమ్మ దేవాలయం నుంచి చెరువుకట్ట తూము వరకు తాత్కాలికంగా వీధిలైట్లు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. క్రేన్ ఏర్పాటు చేయాలని ఈఓకు విన్నవించారు.



చారకొండలో ఎమ్మెల్యే వంశీకృష్ణకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు



ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న రైతులు

పాల బిల్లులు చెల్లించాలని..

వెల్దండ: మండల కేంద్రంలో పాడి రైతులు విజయ డైయిరీలో పెండింగ్‌లో ఉన్న పాల బిల్లులు ఇప్పించాలని కోరుతూ మంగళవారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పాడి రైతులు మాట్లాడుతూ కొన్ని నెలలుగా పాల బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో పాడిరైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. అనంతరం ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు భూపతి రెడ్డి, సంజీవ్‌కుమార్, కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు మోతిలాల్‌నాయక్, నారాయణ, యకూబ్, వెంకటయ్యగౌడ్, పాడి రైతులు తదితరులు ఉన్నారు.